అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

చెట్టును ఢీకొన్న కారు

- మామ, అల్లుడితోపాటు కారు డ్రైవర్ మృతి
- మరో మహిళకు గాయాలు
- మృతులంతా ఏపీలోని అనంతపూర్ వాసులు

భూత్పూర్, ఫిబ్రవరి 21: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు చెందిన ఎస్సై నండూరి వెంకటరమణ(55) తన కూతురు అనూషకు హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన పవన్ సాయి(27)తో ఈ నెల 14న వివాహం జరిపించాడు. బుధవారం హైదరాబాద్‌లోని అల్లుడి ఇంట్లో విందుకు హాజరయ్యాడు. అనంతరం కారు(ఏపీ 02 బీఆర్ 2556)లో కూతురు, అల్లుడితోపాటు కారు డ్రైవర్ చందు(25)తో కలిసి అనంతపూర్‌కు బయలుదేరాడు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ సమీపంలోని జాతీయ రహదారిపైకి రాగానే వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇనుప రాడ్డును తాకింది. పల్టీలు కొడుతూ సమీపంలోని చెట్టును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వెంకటరమణతోపాటు అల్లుడు పవన్‌సాయి, డ్రైవర్ చందు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కూతురు అనూషకు తీవ్ర గాయాలయ్యాయి. కారు పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు వారిని అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

పారదర్శకంగా పార్లమెంట్ ఎన్నికలు

- సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా
- అఖిలపక్ష సమావేశంలో సీఈవో వికాస్‌రాజ్
- కాంగ్రెస్ భౌతికదాడులను అరికట్టాలి: బీఆర్ఎస్
- 9 లక్షల డూప్లికేట్ ఓట్లను తొలగించాలి : బీజేపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌లో బుధవారం ఆయన అధ్యక్షతన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోడ్ ఉల్లంఘన, ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పార్టీల ప్రతినిధులకు సీఈవో వివరించారు. సమావేశానికి బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కే వాసుదేవరెడ్డి హాజరయ్యారు. వాసుదేవరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ఎన్నికలు జరుగుతున్నందున ఓటర్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్‌స్టేషన్‌లో ఉండేలా చూడాలని, ఒకటే పేరుతో రెండు రాష్ట్రాల్లో ఉన్న ఓట్లను సరిదిద్దాలని, అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాలపై చేస్తున్న భౌతిక దాడులను అరికట్టాలని కోరినట్టు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒకే అడ్రెస్‌పై 55 వేల ఓట్లు ఉన్నాయని తెలిపినట్టు బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో ఉన్న 9 లక్షల డూప్లికేట్ ఓట్లను తొలగించాలని కోరినట్టు తెలిపారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఫాలీ నారీమన్ అస్తమయం

- భారత న్యాయ వ్యవస్థపై చెరగని ముద్ర
- సొలిసిటర్ జనరల్, అటార్నీ జనరల్‌గా సేవలు
- ప్రధాని, సీజేఐ సహా పలువురి ప్రముఖుల సంతాపం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: భారత న్యాయవ్యవస్థలో భీష్మ పితామహుడిగా పేరు గడించిన ప్రముఖ న్యాయవాది ఫాలీ ఎస్ నారీమన్ (95) బుధవారం కన్నుమూశారు. పలు అనారోగ్య సమస్యలకు తోడు గుండెపోటు రావటంతో ఆయన తుదిశ్వాస విడిచినట్టు ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. పౌర హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకిక విధానం కాపాడేందుకు జీవితాంతం శ్రమించిన నారీమన్‌కు.. ఏ ప్రభుత్వాలపైన అయినా ధైర్యంగా తన అభిప్రాయాలు వ్యక్తీకరిస్తారన్న పేరు ఉన్నది. ఆయన ఎంతోమంది న్యాయవాదులు, న్యాయమూర్తులకు మెంటార్‌గా కూడా పనిచేశారు. ఆయన కెరీర్‌లో దాదాపు సగం కాలం కేంద్ర ప్రభుత్వానికి సొలిసిటర్ జనరల్‌గా, అటార్నీ జనరల్‌గా సేవలందించారు.

సుప్రీంలో సుదీర్ఘ ప్రయాణం

ఫాలీ ఎస్ నారీమన్ మయన్మార్‌లోని రంగూన్ (యాంగాన్)లో వ్యాపార కుటుంబంలో జన్మించారు. 1950లో బాంబేలో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1972లో ఢిల్లీకి తరలివెళ్లి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1972, మేలో నారీమన్‌ను అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమించారు. 1975, జూన్ 26న ఆమె దేశంలో ఎమర్జెన్సీ విధించటంతో ఆ మరుసటి రోజే నారీమన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన భారతదేశ సొలిసిటర్ జనరల్‌గా, అటార్నీ జనరల్‌గా సుదీర్ఘకాలం సేవలందించారు. 1991 నుంచి 2010 వరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా పనిచేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ న్యాయ సంస్థల్లో సభ్యుడిగా కొనసాగారు. నారీమన్ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1991లో పద్మభూషణ్, 2007లో పద్మవిభూషణ్ పురస్కారాలిచ్చి సత్కరించింది. భారత న్యాయవ్యవస్థలో ల్యాండ్‌మార్క్ వంటి అనేక కేసులను ఆయన వాదించారు. రాజ్యాంగ 'మౌలిక లక్షణం'పై తొలిసారి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కేశవానంద భారతి కేసులో ప్రముఖ న్యాయవాది నానాభాయ్ పాల్కీవాలాకు నారీమన్ సహాయకుడిగా పని చేశారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో యూనియన్ కార్బైడ్ తరపున వాదించిన ఆయన, ఆ తర్వాత పశ్చాత్తాపం వ్యక్తంచేశారు. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం తెచ్చిన ఎన్‌జేఏసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో వాదించి విజయం సాధించారు. నర్మదా డ్యాం కేసులో గుజరాత్ ప్రభుత్వం తరపున వాదించినా, ఆ తర్వాత ఆ ప్రాంతంలో క్రైస్తవులపై దాడుల నేపథ్యంలో తన వకాల్తాను ఉపసంహరించుకొన్నారు. నారీమన్ మృతికి భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ సీజేఐ ఎన్వీ రమణ తదితరులు సంతాపం తెలిపారు. దేశం గొప్ప మేధావిని, న్యాయకోవిదుడిని కోల్పోయిందని విచారం వ్యక్తంచేశారు.

భారత్‌జీపీటీ 'హనుమాన్'

- వచ్చే నెలలో సేవలు ప్రారంభం

ముంబై: ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్న నూతన సాంకేతికతల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒకటి. ఈ టెక్నాలజీలో భారత్ కీలక పాత్ర పోషించేందుకు దోహదపడేలా 'హనుమాన్' పేరుతో సీతా మహలక్ష్మి హెల్త్‌కేర్ (ఎస్ఎంఎల్) సంస్థ ఓ లార్జ్ లాంగ్వేజ్ మాడల్ (ఎల్ఎల్ఎం)ను ఆవిష్కరించింది. ఏకంగా 22 భారతీయ భాషల్లో ఆరోగ్య సంరక్షణ, పరిపాలన, విద్య, ఆర్థిక సేవలు తదితర రంగాలకు సంబంధించిన సేవలను అందించగలిగే ఈ ఎల్ఎల్ఎంను బాంబే ఐఐటీ నేతృత్వంలోని భారత్ జీపీటీ ఎకోసిస్టం భాగస్వామ్యంతో ఆవిష్కరించారు. బాంబే ఐఐటీతోపాటు మరో 7 ఇతర ఐఐటీల ఆధ్వర్యంలో పనిచేస్తున్న భారత్ జీపీటీ ఎకోసిస్టం వాస్తవానికి ఓ రిసెర్చ్ కన్సార్షియం. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఆధ్వర్యంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌తోపాటు కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం, ఎస్ఎంఎల్ తోడ్పాటుతో ముందుకు సాగుతున్న ఈ కన్సార్షియం.. చాట్ జీపీటీ తరహాలో సేవలందించే భారత్ జీపీటీని వచ్చే నెలలో ప్రారంభించనున్నది. స్పీచ్-టు-టెక్స్ట్, టెక్స్ట్-టు-స్పీచ్, టెక్స్ట్-టు-వీడియో, వీడియో-టు-టెక్స్ట్ జనరేటింగ్ లాంటి బహుళ సామర్థ్యాలను కలిగి ఉన్న 'హనుమాన్' ఎల్ఎల్ఎం ప్రస్తుతానికి హిందీ, తమిళ్, తెలుగు, మళయాళం, మరాఠీ తదితర 11 భారతీయ భాషల్లో ప్రతిస్పందిస్తున్నది. మున్ముందు 22 భారతీయ భాషల్లో ప్రతిస్పందించగలిగేలా సామర్థ్యాన్ని పెంచాలని భావిస్తున్నారు.

ఉద్యోగులకు కంపెనీ రాసిచ్చిన మిలియనీర్

న్యూయార్క్ : లాభాల కోసం కార్మికులను తొలగిస్తున్న ఈ రోజుల్లో, అమెరికాలో ఓ సంస్థ యజమాని తన కంపెనీని కార్మికులకు రాసిచ్చాడు. ఆయన పేరు బాబ్ మూర్.. బాబ్స్ రెడ్‌మిల్ పేరిట ఉన్న ఇతని కంపెనీలో ఇప్పుడు 700 మంది ఉద్యోగులున్నారు. దీని యజమాని మిలియనీర్ అయిన మూర్ తన చిరకాల వాంఛను ఈ విధంగా నెరవేర్చుకున్నారు. ఇటీవలే 94 ఏండ్ల వయసులో మూర్ మరణించారు. అమెరికాకు చెందిన మూర్ ఈ సంస్థను 1978లో ఏర్పాటు చేశారు. చిరుధాన్యాలతో నాణ్యమైన ఉత్పత్తులను ఈ సంస్థ తయారు చేసి విక్రయిస్తుంది. సంస్థ అనతికాలంలోనే అభివృద్ధి చెందడానికి ఉద్యోగులే కారణమని మూర్ ఎప్పుడూ అభిప్రాయపడేవాడు. అందుకు తన కంపెనీలో వారికి యాజమాన్యం ఇవ్వాలనుకున్నాడు.

చైనా గజగజ

జిన్‌జియాంగ్ : చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతం మునుపెన్నడూ చూడని అతి శీతల వాతావరణంతో గజగజ వణుకుతున్నది. గత 64 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా గత మూడు రోజులుగా మైనస్ 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు, పశు పక్షాదులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వందలాది పక్షులు నేలకూలి మరణిస్తున్నాయి. రోడ్లపై ఎక్కడ చూసినా వీటి కళేబరాలే కన్పిస్తున్నాయి. జలపాతాలు, సరస్సులు గడ్డకట్టాయి.

ఒకే బేస్‌మెంట్‌లో 25 మంది విద్యార్థులు

- కెనడాలో హౌసింగ్ సంక్షోభం
- అధిక కిరాయి కోసం ఇంటి యజమానుల అక్రమాలు

ఒట్టావా: ఇండ్ల సంక్షోభం నెలకొన్న కెనడాలో విదేశీ విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉన్నది. ఉన్నత విద్య అభ్యసించేందుకు అక్కడకు వెళ్లిన వారికి ఇండ్లు దొరకడం కష్టతరంగా మారింది. ఇటీవల బ్రాంప్టన్ పట్టణంలోని ఒక అద్దె భవనంపై దాడులు చేసిన అధికారులు.. ఆ భవనం బేస్‌మెంట్‌లో ఏకంగా 25 మంది విద్యార్థులు నివసిస్తున్నట్టు గుర్తించారు. ఈ నేపథ్యంలో నగర మేయర్ పాట్రిక్ బ్రౌన్ కీలక నిర్ణయం తీసుకొన్నారు. యజమానులు తమ రెంటల్ ప్రాపర్టీలను నగర కౌన్సిల్ వద్ద తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొనేలా ఒక చట్టం తీసుకురానున్నట్టు వెల్లడించారు. నగరంలో ఇలాంటి అక్రమ అద్దె కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సింగిల్ యూనిట్‌ను డజన్ల మంది విదేశీ విద్యార్థులకు అద్దెకు ఇవ్వడం ద్వారా యజమానులు భద్రతా ప్రమాణాలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో జీవించేలా చేస్తున్నారని అన్నారు. అలాంటి యాజమానులపై తగిన చర్యలు తీసుకొంటామని మేయర్ హెచ్చరించారు. బ్రాంప్టన్‌లో గణనీయమైన సంఖ్యలో భారతీయ వలసదారులు నివసిస్తుంటారు.

సముద్రం అడుగున 100 రోజులు

న్యూయార్క్: అమెరికా నావికా దళం మాజీ డైవర్, బయోమెడికల్ ఇంజినీరింగ్ స్పెషలిస్ట్ జో డిటూరీ నీటి అడుగున 100 రోజులు నివసించి సరికొత్త రికార్డు సృష్టించారు. గతంలో నమోదైన 74 రోజుల రికార్డును చెరిపేశారు. సముద్రపు నీటి అడుగున ఎక్కువ కాలం నివసించవచ్చునని ఆయన నిరూపించారు. సముద్రంలో 100 రోజులపాటు నివసించిన అనుభవం తన జీవితాన్ని మార్చిందని ఆయన తెలిపారు. కొత్త విషయాలను తెలుసుకోవడం ఎల్లప్పుడూ వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. అన్ని హద్దులను చెరిపేసే విధంగా నూతన తరం పరిశోధకులకు తాను ప్రేరణగా నిలుస్తానని ఆశిస్తున్నట్లు చెప్పారు.

- 26 అడుగుల భారీ అనకొండ

ఏకంగా 26 అడుగుల పొడవు ఉండే ప్రపంచంలోనే అతి పెద్ద పామును పరిశోధకులు అమెజాన్ రెయిన్ ఫారెస్టులో గుర్తించారు. టీవీ వన్యప్రాణి ప్రజెంటర్, ప్రొఫెసర్ ఫ్రీక్ వోంక్ ఈ భారీ అనకొండను నీటి అడుగున తిరుగుతుండగా కనిపెట్టారు. 200 కిలోల బరువు ఉండే ఈ అనకొండ ప్రపంచంలోనే అతిపెద్ద, బరువైన పాముగా చెబుతున్నారు.

చైనా యువకుడికి రూ.795 కోట్ల జాక్‌పాట్

బీజింగ్: చైనా వెల్ఫేర్ లాటరీలో ఓ యువ వ్యాపారి (28) దేశంలోనే అత్యధిక బహుమతిని సొంతం చేసుకున్నారు. గుయిఝూ ప్రావిన్స్‌కు చెందిన ఈ చిరు వ్యాపారి లాటరీలో రూ.795.84 కోట్లు గెలుచుకున్నాడని నిర్వాహకులు తెలిపారు. ఆయన 133 టికెట్లను కొన్నారని, ప్రతిసారీ ఒకే గ్రూపునకు చెందిన ఏడు నంబర్లపై పందెం కాసేవారని, ప్రతి టికెట్‌కు దాదాపు రూ.6 కోట్ల చొప్పున బహుమతి వచ్చిందని తెలిపారు. విజేత వివరాలను ఈ సంస్థ బయటపెట్టలేదు. గుర్తు తెలియని ఆ విజేత ఈ నెల 7న బహుమతిని స్వీకరించేందుకు వచ్చారని తెలిపింది. విజేత స్పందిస్తూ, ఉద్వేగభరితుడినయ్యానని, నిద్ర పట్టలేదని చెప్పారు. బహుమతిలో ఐదో వంతు పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది.

శ్రీశైలంలో ముగిసిన మహా కుంభాభిషేకం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం క్షేత్రంలో ఈ నెల 16న ప్రారంభమైన మహా కుంభాభిషేక మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజున పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి, చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య, విద్యాశంకర భారతి, మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలో శివాజీ గోపుర పునర్నిర్మాణం, ఉపాలయాల పునరుద్ధరణ, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వళవన్, కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో రేషన్ డీలర్ల ధర్నా

- 50 కిలోల బస్తాలో రెండు కిలోల బియ్యం తరుగు
- తీవ్రంగా నష్టపోతున్నామంటూ రేషన్ డీలర్ల ఆందోళన

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బేల మండలాల్లో మండల్ లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్‌లో కాంటా వేయకుండా డీలర్లకు బియ్యం పంపిణీ చేయడంతో ఒకటి నుంచి రెండు కిలోలు తరుగు వస్తుండటంపై డీలర్లు ఆందోళన వ్యక్తంచేశారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చే ప్రతి 50 కిలోల బస్తాలో ఒకటి నుంచి రెండు కిలోల బియ్యం తరుగు వస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం కిలో రూ.29, కంది పప్పు, మిగతా సరుకులను రేషన్ షాపు నుంచి సరఫరా చేయాలని కోరారు. అనంతరం డీఎస్వో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

బాబుకు రెస్ట్ ఇద్దాం!

- కుప్పం నుంచి నేనే పోటీ చేస్తా!
- భువనేశ్వరి వ్యాఖ్యలు వైరల్
- అలాంటిదేమీ లేదని వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): టీడీపీ కంచుకోట కుప్పం వేదికగా చంద్రబాబుకు ఊహించని షాక్ తగిలింది. కుప్పం నుంచి పోటీ చేయకుండా చంద్రబాబుకు రెస్ట్ ఇద్దామంటూ ఆయన సతీమణి భువనేశ్వరి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. 35 ఏండ్లుగా కుప్పం నుంచి బాబు పోటీ చేస్తున్నారని, ఈసారి అక్కడి నుంచి తానే బరిలో నిలవాలనుకుంటున్నట్టు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతున్నది. 'న్యాయం గెలవాలి' యాత్రలో భాగంగా బుధవారం కుప్పం లో ప్రజలను ఉద్దేశించి భువనేశ్వరి ప్రసంగిస్తూ చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లోనే వైరల్ అయ్యాయి. ప్రసంగం చివర్లో మాత్రం ఆ వ్యాఖ్యలు సరదాగా చేసినవే నని, తనకు పోటీచేసే ఉద్దేశమే లేదని చెప్పడంతో ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. భువనేశ్వరి వ్యాఖ్యలను మాత్రం వైసీపీ సీరియస్‌గానే తీసుకుంది. బాబులో భయం మొదలైందని, ఆమె వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

హారన్ కొట్టాడని బస్సు డ్రైవర్‌పై దాడి

ఆర్మూర్‌లో బస్సు డ్రైవర్ల నిరసన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 21: కండక్టర్ కోసం హారన్ కొట్టిన బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో బుధవారం చోటుచేసుకున్నది. ఆర్మూర్ డిపోకు చెందిన డ్రైవర్ నర్సయ్య ఉదయం బస్సును తీసుకొచ్చి బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపాడు. కండక్టర్ రావడం లేదని హారన్ కొడుతుంటే.. అక్కడే ఉన్న ప్రయాణికులు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కొందరు అతడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది అక్కడికి చేరుకుని సర్దిచెప్పారు. డ్రైవర్‌పై దాడిని నిరసిస్తూ మిగతా డ్రైవర్లు, సిబ్బంది బస్సులు నిలిపివేసి బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే తమపై భౌతికదాడులకు దిగడం సిగ్గుచేటని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పరిధిలోని నల్లమల అడవిలో బుధవారం మరోమారు కార్చిచ్చు రేగింది. 15 రోజుల వ్యవధిలో 10 సార్లు మంటలు చెలరేగి అటవీ అధికారులకు సవాల్ విసురుతున్నది. అచ్చంపేట నుంచి శ్రీశైలం వరకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా.. క్విక్ రెస్పాన్స్ టీంలను అందుబాటులో ఉంచినా.. కార్చిచ్చు మాత్రం ఆగడం లేదు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ/లింగాల

ఒకటిన జీతాలు.. ఉత్తమాటేనా!

మొదటిపేజీ తరువాయి...

వేతన బకాయిలు ఉన్నాయి. సెకండ్ ఏఎన్ఎంలకు మాత్రమే ఒక నెల వేతనం అందించారు. దాదాపు 10వేల మందికి ఇంకో నెల జీతం బకాయి ఉన్నది. మిగతా స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బందికి రెండు నెలల వేతనం అందాల్సి ఉన్నది. ఇలాంటివారు సుమారు 5వేల మంది వరకు ఉంటారు.

మ్యానిఫెస్టోకు మంగళం

ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ విషయాన్నే మరిచింది. 20 తేదీ వచ్చినా వేతనాలు అందక చిరుద్యోగులు లబోదిబోమంటున్నారు. మరీ ముఖ్యంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఎదురుచూపులు తప్పడం లేదు. జీతాలే కాదు, పెన్షన్ల విషయంలోనూ ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తున్నది. రిటైర్డ్ ఉద్యోగులకు 1-10 తేదీల మధ్యలో పింఛన్లు జమచేయగా, గురుకులాల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ నెల 16న వేతనాలు జమ అయ్యాయి. ధూపదీప నైవేద్యం పథకంలోని అర్చకులకు 20 రోజులు ఆలస్యంగా వేతనాలు అందాయి.

క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా

- గ్రంథాలయాల్లో పనిచేసే రెగ్యులర్ లైబ్రేరియన్లకు 12 జిల్లాల్లో బుధవారం వేతనాలు అందాయి. మంచిర్యాల, భూపాలపల్లి, వనపర్తి జిల్లాలకు ఇంకా వేతనాలు అందాల్సి ఉంది.
- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మూడు నెలలుగా వేతనాలు లేవు.

- సమగ్రశిక్షా ప్రాజెక్ట్‌లో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్‌కు జనవరి నెల వేతనాలు అందలేదు.
- సమగ్రశిక్ష సెక్టోరల్ ఆఫీసర్లు, డాటాఎంట్రీ ఆపరేటర్ల జనవరి నెల వేతనాలు కూడా ఇంకా పడలేదు.
- ఉద్యోగులు, పెన్షనర్లు, టీచర్లకు చెల్లించాల్సిన మూడు డీఏలు బకాయిలున్నాయి. వీటిని ఇప్పటివరకు చెల్లించలేదు.
- విద్యార్థుల యూనిఫారాల కుట్టుకూలి చార్జీలు ఇప్పటికీ అందలేదు.
- కేజీబీవీ సీఆర్టీ, పీజీసీఆర్టీ, స్పెషలాఫీసర్ల జనవరి నెల వేతనాలు పెండింగులో ఉన్నాయి.
- మధ్యాహ్న భోజన కార్మికులకు అక్టోబర్ 2023 నుంచి పారితోషికం అందలేదు. దీనికి రూ. 3వేలకు పెంచినా పెరిగిన మొత్తం లబ్ధిదారులకు అందలేదు.
- ఉద్యోగులు, టీచర్ల జీపీఎఫ్, సరెండర్ లీవుల బిల్లులు క్లియర్ చేయలేదు.
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు నవంబర్ 2023 నుంచి పెండింగులో ఉన్నాయి.
- సెర్ప్ ఉద్యోగులుకు జనవరి నెల జీతాలు అందలేదు.
- ఉపాధిహామీ పథకం ఉద్యోగులకు డిసెంబర్ నుంచి రెండు నెలలుగా వేతనాల్లేవు.
- వీఏవోలకు జనవరి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.
- అటవీశాఖలో వాచర్స్‌కు మూడునెలలుగా వేతనాల్లేవు.

కొత్త ఏడాదిలో వేతనాలు రాలే

ఎస్ఎస్ఏలో 19,600 మంది ఉద్యోగులమున్నాం. కొత్త సంవత్సరంలో జనవరి వేతనాలు ఇంకా అందలేదు. పెరిగిన నిత్యావసర ధరలు, ఈఎంఐలు కట్టలేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందించాలి. ఏపీలో మన కంటే రూ.6 వేలు అధికంగా వేతనాలిస్తున్నారు. కాబట్టి వెంటనే ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలుచేయాలి.

– డీ యాదగిరి, సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి

రెండు నెలలుగా జీతాల్లేవు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాకు వేతనాలు రాలేదు. ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనంతోనే మా కుటుంబాలు సాగుతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ కష్టపడేది మేమే. అయినా, వేతనాలు సరిగా ఇవ్వడం లేదు. కొత్త ప్రభుత్వం మాకు వేతనాలు పెంచి ప్రభుత్వ ఉద్యోగుల్లా ప్రతి నెలా 5వ తేదీలోపే జీతాలు అందిస్తుందనుకుంటే నిరాశే మిగిలింది.

– స్వరూప, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి

ఎమ్మెల్సీ కవితకు సీబీఐ నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు సీబీఐ అధికారులు బుధవారం నోటీసులు అందజేశారు. ఈ నెల 26వ తేదీన తమ ముందు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. మద్యం పాలసీ కేసులో 2022 డిసెంబర్‌లోనే కవితను సీబీఐ విచారించింది. వాంగ్మూలం కూడా నమోదు చేసింది. ఇదిలాఉండగా ఇప్పటికే ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణపై సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్నది.

28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి: కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం సిఫారసు ప్రకారం 28 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని, కేంద్ర బడ్జెట్‌లో బీసీల బడ్జెట్‌ను రూ.2 లక్షల కోట్లకు పెంచాలని, ఈ మేరకు కేంద్రానికి సిఫారసు చేయాలని జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

దీపాదాస్‌కు బెంజ్ గిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి...

సమాచారం. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిలుగా పనిచేసిన నాయకులు వరుసగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2018 శాసనసభ ఎన్నికల సమయంలో రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న ఆర్సీ కుంతియా ఎమ్మెల్యే టిక్కెట్లు అమ్ముకున్నారని అదే పార్టీకి చెందిన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లేశ్‌యాదవ్ ఆరోపించారు. ఆ తర్వాత రాష్ట్ర ఇన్‌చార్జిగా వచ్చిన మాణిక్కం ఠాకూర్‌పై పార్టీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఇలాంటి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మాణిక్కం ఠాకూర్‌కు కోట్లాది రూప